

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

19 వ వసంతంలోకి ...

ఏలూరు జిల్లా పశ్చిమ గోదావరి జిల్లా

శుక్రవారం,5 డిశంబర్ 2025

8 పేజీలు


### పుష్కరాలకు ముందే
# పోలవరం ప్రాజెక్ట్ పూర్తి

- జగన్ విధ్వంసంతో మళ్లీ నిర్మిస్తున్న డయా ఫ్రమ్ వాల్ ఫిబ్రవరికి పూర్తి
- ప్రాజెక్టు పనుల పురోగతిపై సమీక్ష చేసిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా.'నిమ్మల'





**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఆంధ్రుల జీవనాడి, రాష్ట్ర ప్రజలకు వరంఅయిన పోలవరం ప్రాజెక్టును నిర్ణయించిన గడువు 2027 డిసెంబరు కన్నా ముందుగానే, అదే ఏడాది జరిగే గోదావరి పుష్కరాలు నాటికేపూర్తిచేయాలనిరాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుఅధికారులను ఆదేశించారు .పోలవరం ప్రాజెక్టు పనులను,పురోగతిని ఆయన గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడేఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనలు మేరకు పవిత్ర గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేసే విధంగా అధికారులు, ఇంజనీరింగు నిపుణులు, నిర్మాణ ఏజెన్సీలు మరింత చురుగ్గా పనిచేయాలనిసూచించారు. ఈ సమావేశానికి ముందు ప్రాజెక్టు పరిధిలోని గ్యాప్ -1లో ప్రధాన డ్యామ్ రాక్ ఫిల్లింగ్ పనులు, గ్యాప్ -2లో డయా ఫ్రంవాల్ నిర్మాణపనులు,కుడికాలువ అను సంధానం పనుల్లో భాగంగా జంట సొరంగాల్లో జరుగుతున్న క్లిష్టమైన లైనింగ్ పనులను మంత్రి స్వయంగా పరిశీలించి వివరాలు అడిగితెలుసుకున్నారు. అధికారులు చెప్పిన సమాధానాలకు, గడువు ఆధారంగా జరుగుతున్న పనులకు పూర్తి సంతృప్తి చెందారు. వారిని మనస్ఫూర్తిగా అభినందించి

- తరువాయి 2లో..

# జనసేనకు జవసత్వాలు

- నియోజకవర్గం నుంచి గ్రామం వరకు కమిటీలు
- ఇంకో వైపు పార్టీ బలోపేతం - స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యం !

**ఏలూరు,సూర్య ప్రతినిధి :** ఇప్పటికే పాలనా పరంగా నిలదొక్కు కుంటూనే ఇంకో వైపు పార్టీ పునాదులను మరింత పటిష్టత కు రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, జన సేనాని పవన్ కళ్యాణ్ దృష్టి పెట్టారు. పాలనా వ్యవహారాల్లో తన సత్తా చూపడానికి ఈమధ్య ఆయన తరచూ తన పరిధిలోఉన్నశాఖల సమీక్షస్తు న్నారు. ప్రత్యేకంగా పంచాయతీ రాజ్ విభాగంలో పవన్ చొరవకు స్థానికంగా ఒకింత మంచి మార్కులే లభిస్తున్నాయి. డిడిఓ ల దగ్గర నుంచి గ్రామీణ రోడ్లు, తాగునీటి సరఫరా, అటవీ శాఖలో కొన్ని మార్పులు చేసి గురువారంరాష్ట్రంలో ఒకేసారి77 డిడిఓలు, డిఎల్‌డిఓల కార్యాలయాలు ప్రారంభించడం ద్వారా పవన్ కళ్యాణ్ తన శాఖపై శ్రద్ధ తీసుకొన్నారనేది స్పష్టమవుతోంది.

**పార్టీ వైపు దృష్టి –** ఇంకోవైపు జన సేన క్షేత్ర స్థాయిలో మరింత బలపడేలా ఉప ముఖ్య మంత్రి జాగ్రత్త పడుతున్నారు. పాలన, పార్టీ అభివృద్ధి కి సమానంగా సమయం కేటాయిస్తున్నారు. ఇంతకుముందు పార్టీ సభ్యత్వం నమోదు జరిగే నాటికీ పార్టీ ముఖ్యులు కొన్ని అవంతరాలు ఎదుర్కొన్నారు. పార్టీ నిర్దేశించిన విధంగా కొన్ని నియోజకవర్గ లలోసభ్యత్వ నమోదు జరగ లేదు. గ్రామ, మండల, నియోజక స్థాయిలో కమిటీ లు లేకపోవడమే లోపాలకు ప్రధాన కారణం గా గుర్తించారు. ఇకముందు ఇలాంటి అనుభవాలు పునరావృతమ్ కాకుండా ఎట్టిపరిస్థితిల్లో ఈ కమిటీ లు ఏర్పాటు కు జనసేన రంగం సిద్ధం చేస్తున్నది. తాజా గా పార్టీ రాష్ట్ర కార్యాలయం లో ముఖ్య నాయుకులతో పవన్ బేటీ అయినప్పుడు ఇదే అంశం ప్రస్తావన కు వచ్చింది. గ్రామ, మండల,

- తరువాయి 2లో..

## జాతీయ రహదారిగా ఏలూరు - జంగారెడ్డిగూడెం రోడ్డు

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ పుట్టా మహేష్ విజ్ఞప్తి

ఏలూరు/ఢిల్లీ,మేజర్‌న్యూస్ :

- మిగతా 8 లో..

### పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో
# సమర్థవంతంగా సంస్కరణలు

- వర్చువల్‌గా ప్రారంభించిన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్
- ఏలూరులో హాజరైన జిల్లా అధికారులు,ప్రజాప్రతినిధులు



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** స్థానిక శనివారపుపేటలో గురువారం డివిజనల్ అభివృద్ధి అధికారి వారి కార్యాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కార్యాలయం నుండి 77 డివిజనల్ అభివృద్ధి అధికారి వారి (డిఎల్‌డివో కార్యాలయాలు) కార్యాలయాలను వర్చువల్‌గా ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ప్రారంభించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, జిల్లా పరిషత్తు చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, శాసన మండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి),దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సంయుక్తంగా వీక్షించి, అనంతరం డివిజనల్ అభివృద్ధి అధికారి వారి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్చువల్ ద్వారా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిల పవన్ కల్యాణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో సంస్కరణలు

- తరువాయి 2లో..

# ఏసీబీకి చిక్కిన గ్రామీణ నీటి పారుదల శాఖ ఎఇ,డిఇ



**కొయ్యలగూడెం రూరల్,మేజర్‌న్యూస్ :** కొయ్యలగూడెం గ్రామీణ నీటి సరఫరా ,పారిశుద్ధ్య శాఖపై అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సంబంధిత శాఖ డిఈ, ఏఈలనువిచారిస్తున్న ఏసీబీ అధికారులు. కాంట్రాక్టర్ నల్లబోతుల కోటేశ్వరరావు వద్ద నుండి 1లక్ష 50వేలు సొమ్ము తీసుకొనుచుండగా అధికారులు దాడిచేశారు. కాంట్రాక్టర్ బిల్లు 75 లక్షలు చెల్లింపులో అధికారులు చెల్లింపులు అవ్వకుండా నిలుపుదలచేయడంతో కాంట్రాక్టర్ అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించడంతో గురువారం సాయంత్రం కొయ్యలగూడెం డివిజనల్ ఆఫీస్ వద్ద ఎసిబి అధికారులు పట్టుకున్నారు. డివిజన్ పరిధిలో కాంట్రాక్టర్ వద్ద నుండిబిల్లులు చెల్లింపులు అక్రమాలకు పాల్పడుతున్నట్లు కాంట్రాక్టర్లు గగ్గోలు పెట్టడంతో ఈదాడులు నిర్వహించినట్లు తెలుస్తున్నాయి. సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు బిల్లులు విషయంపై కాంట్రాక్టర్లు మొరపెట్టుకున్న బిల్లులు చెల్లింపులు అధికారులు తీరు మారకపోవడంతో ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు. డివిజనల్ అధికారి 50వేలరూపాయలు,అసిస్టెంట్ ఇంజనీర్ ఏఈ లక్షరూపాయలు అందజేస్తుండగా దాడి నిర్వహించినట్లు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈదాడుల్లో ఏసీబీ డిఎస్పి వి.సుబ్బరాజుసీఐ ఎం.బాల కృష్ణ,సీఐ కే్శ్రీనివాస్,సీఐఎస్వి భాస్కర్ రావు,ఎస్సై వి రామకోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# యాచకురాలి నిజాయితీ

- దొరికిన రూ.36వేలు నగదు అప్పగింత




**భీమడోలు,మేజర్‌న్యూస్ :**భీమడోలు జంక్షన్‌లో గల బస్టాండు దాని పరిసర ప్రాంతాల్లో చంకలో చిన్నపిల్లతోబిక్షాటన చేసుకునే యాచకురాలి నిజాయితీని భీమడోలు సి.ఐ. యు.జె.విల్సన్, ఎస్సై మదీనా భాష అభినందించారు. కాకినాడ జిల్లా కొండలరావు ప్రాంతానికి చెందిన జువ్వల సత్యనారాయణ ప్రయాణంలో భాగంగా భీమడోలు బస్టాండ్ లో గురువారం మధ్యాహ్నం దిగారు. ఇదే సమయంలో తన జేబులో ఉన్న రూ. 36వేలు నగదు గల్లంతయినట్టు గుర్తించారు. భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్తలేని కారణంగా తనచిన్నపిల్లతో యాచకం చేసుకుంటూ జీవిస్తున్న తిరుమలశెట్టి కరుణఅనేమహిళకుఆ సొమ్ములు దొరికాయి. వాటిని తీసుకున్న యాచకురాలు నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తనకు దొరికిన తీరువివరిస్తూ ఆ సొమ్మును పోలీసులకు అప్పగించింది. పోలీసులు సొమ్ము పోగొట్టుకున్న వ్యక్తిని పోలీస్ స్టేషన్ కు పిలిపించి యాచకురాలు చేతుల మీదిగా సొమ్ము పోగొట్టుకున్న వ్యక్తికి అందజేశారు. యాచకురాలి నిజాయితీని భీమడోలు పోలీసులతో పాటు, సొమ్ములుపోగొట్టుకునితిరిగిపొందినసత్యనారాయణ అభినందించారు.

# ఆర్టీసీ బస్సులు సకాలంలో నడపాలి





పెదవేగి,మేజర్‌న్యూస్ : గ్రామాల నుండి కళాశాలలకు వెళ్లే విద్యార్థుల కష్టాలు వర్ణనాతీతం. సమయానికి బస్సులు నడపాలని విద్యార్థులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న వారి బాధను ఆలకించే నాధుడే లేదు. 2025 జూన్ నెల నుండి కళాశాలలు ప్రారంభం కాగా ఇప్పటివరకు ఆర్టీసీ అధికారులు వీరి కష్టాలను అర్థం చేసుకోలేదు.అప్పుడప్పుడు గ్రామాలలో బస్సులను ఆపి నిరసన వ్యక్తం చేసినప్పటికీ, గ్రామ పెద్దలు, ఇతరుల జోక్యంతో వారి నిరసనకు అర్థం లేకుండానే పోతుంది. ఈరోజు గురు వారం ఉదయం పెదవేగి మండలం కూచింపూడి గ్రామంలో విద్యార్థులు కళాశాలకు వెళ్లడానికి బస్సు నిండిపోవడంతో చేసేదిలేక అధికారులు అధికారులు ఇక్కడకు వచ్చి తమ సమస్యను పరిష్కరించాలని మరలా బస్సును ఆపడం జరిగింది.

దీనిపై గ్రామ పెద్దలు జోక్యం చేసుకొని ఆర్టీసీ అధికారులతో మాట్లాడినప్పటికీ వారికి సరైన సమాధానం దొరకలేదు. దీనిపై దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరించడం జరుగుతుందని గ్రామ టిడిపి నాయకులు హామీ ఇవ్వడంతో విద్యార్థులు శాంతించారు. ఇకనైనా ఎమ్మెల్యే మా సమస్యను పరిష్కరించి సమయానికి బస్సులు వచ్చే విధంగా చూడాలని వారు కోరుకుంటున్నారు.

# 10న తహసిల్దార్ కార్యాలయాల వద్ద నిరసన,వినతి



ఏలూరు,మేజర్‌న్యూస్ : రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10వ తేదీన ఏపీ రైతు సంఘం,సిపిఐ ఇచ్చిన పిలుపు లో భాగంగా అన్ని మండల తహసిల్దార్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టి తహసిల్దార్ కు విజ్ఞాపన పత్రాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా నిర్మాణ ఉప సంఘ సమావేశం సిపిఐ శ్రేణులకు పిలుపునిచ్చింది. సిపిఐ జిల్లా నిర్మాణ ఉప సంఘ సమావేశం గురువారం స్థానిక స్ఫూర్తి భవనంలో పార్టీ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షతన జరిగింది. ఈనెల10 తేదీన మండల కేంద్రాలలో సిపిఐ మరియు రైతు సంఘం నిర్వహించే నిరసన కార్యక్రమాలలో రైతాంగం పాల్గొనే లాగా చర్యలు తీసుకోవాలని పార్టీ కోరింది.ఈ నెల 13వ తేదీన ఏలూరులో జరుగుతున్న రాష్ట్ర భూ సదస్సును,ఈ నెల 18వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేటీకరణ చేసే విధానానికి వ్యతిరేకంగా సిపిఐ ఇచ్చిన రాష్ట్ర పిలుపును జిల్లా కేంద్రం ఏలూరులో జరిగే నిరసన కార్యక్రమం జయప్రదం చేయాలని మన్నవ కృష్ణ చైతన్య కోరారు.ఏలూరులో ఆర్టీసీ నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులో జరిగిన 82 లక్షల రూపాయల అవినీతిపై జ్యుడీషియల్ ఎంక్వయిరీ నిర్వహించాలని సమావేశం డిమాండ్ చేసింది.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా నిర్మాణ ఉప సంఘ సభ్యులు బండి వెంకటేశ్వరరావు,కారం ధారయ్య, నిమ్మగడ్డ నరసింహ,తొర్లపాటి బాబు పాల్గొన్నారు.

## బీసీ నవ చైతన్య వేదిక కమిటీలకు ప్రతినిధుల నియామకం

– జిల్లా అధ్యక్షులు అల్లాడ సూర్య భాస్కర రావు వెల్లడి



పెనుమంట్ర, మేజర్ న్యూస్ : బీసీ నవ చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు శీలం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు పశ్చిమ గోదావరి జిల్లాలో కమిటీలకు ప్రతి నిధులను నియమించినట్లు జిల్లా అధ్యక్షులు అల్లాడ సూర్య భాస్కర రావు గురువారం ఇక్కడ తెలిపారు.ఈ మేరకు జిల్లా కమిటీ వైస్ ప్రెసిడెంట్ గా తాళ్ల కుమార్ స్వామి,ప్రధాన కార్యదర్శిగా పెచ్చెట్టి వెంకటరమణ, జనరల్ సెక్రెటరీగా ఉటౌధ ధనరాజ్, కోశాధికారిగా ముంగండి నాగ వరప్రసాద్ లను నియమితులు అయినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అల్లాడ సూర్య భాస్కర్ రావు మాట్లాడుతూ ఈనెల 22 న సోమవారం బీసీలకు రిజర్వేషన్లు సాధించడమే లక్ష్యంగా విజయవాడలో ధర్నా కార్యక్రమానికి పిలుపునివ్వడం జరిగిందని అన్నారు.హలో బీసీ చలో విజయవాడ పేరుతో జరిగే ఈ ధర్నా కార్యక్రమానికి పశ్చిమగోదావరి జిల్లా,అంబేద్కర్ కోనసీమ జిల్లా,జిల్లాలతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి బీసీ సోదరులు వేలాదిగా విజయవాడ ధర్నా చౌక్ దగ్గర జరగబోయే ధర్నాలో పాల్గొని, కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరారు.

## నేడు భీమడోలులో ఎమ్మెల్యే ధర్మరాజుచే జనవాణి



భీమడోలు,మేజర్‌న్యూస్: భీమడోలు గ్రామపం చాయతీ వేదికగా ఈనెల 5వ తేదీ ఉదయం శాసన సభ్యులు పత్సమట్ల ధర్మరాజు జనవాణి (ప్రజా సమ స్యల పరిష్కార వేదిక) కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నారని, గ్రామపంచాయతీ కార్యదర్శి తనూజ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శాసనసభ్యులు అందుబాటులో ఉంటారన్నారు.

ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శి కోరారు. ఈ మేరకు శాసనసభ్యుల కార్యాలయం నుంచి సమాచారం అందించిందని కార్యదర్శి తెలిపారు.

# పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో సమర్థవంతంగా సంస్కరణలు

మొదటిపేజీ తరువాయి

సమర్థవంతంగా అమలు చేసి, గ్రామీణ ప్రాంతాల్లో గ్రామీణులు సంతృప్తి చెందే స్థాయిలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతి నిరుపేద ఇంటికి చేరాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిపాలన దక్షతతో దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామని అన్నారు.కార్యాలయాలన్నీ ఒకే చోటకు చేర్చడం వలన మంచి పరిపాలన సౌలభ్యంతో పాటు ప్రజలకు మంచిమేలు జరిగే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు.కనీస మౌలిక వసతులు కల్పనకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవ్వకుండా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయం తో నిధులు సమకూర్చుతున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ శాఖ కమిషనరు ఓయస్డి,జిల్లా నోడల్ అధికారి కె.ఆనంద్, జిల్లా పరిషత్తు ఇంచార్జి సిఇవో కె.భీమేశ్వర రావు, ఏపిడి డ్వామా ఆర్.విక్టర్, డియ్యడిపి పిడి ఆర్.విజయరాజు, డియల్డివో ఏ.బి.పి.వి.లక్ష్మీ, డివిజనల్ పంచాయతీ అధికారి వై.అమ్మాజీ, సంబంధిత శాఖల ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్ట్ పూర్తి

మొదటిపేజీ తరువాయి

2027 డిసెంబరు కంటే ముందుగా పుష్కరాలకు పూర్తిచేస్తే ఒక చరిత్ర సృష్టించిన వాళ్ళమవుతామని ప్రోత్సహించారు. ఈసందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ డయాఫ్రంవాల్ నేటికి 950 మీటర్లు నిర్మాణం జరిగి 75 శాతం పూర్తి చేసినట్లు చెప్పారు.

2014-2019 హయాంలో తెలుగుదేశం ప్రభుత్వం పూర్తి చేసిన 72 శాతం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం 17 నెలల కాలంలో పూర్తి చేసిన 12 శాతం పనులు కలుపుకొని నేటికి పోలవరం ప్రాజెక్ట్ పనులు 88 శాతం పూర్తి చేసినట్లు ఆయన వివరించారు.పోలవరం ప్రాజెక్టు చరిత్రలో ఒక్క ఏడాదిలోనే నిర్వాసితులకు 2వేల కోట్లు ఇచ్చి వారికి అండగా నిలబడిన ఘనత కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు.

రూ.600 కోట్లతో ఎడమ ప్రధాన కాలువ పనులు పూర్తిచేసి 2026 సీజన్ నాటికి అనకాపల్లి వరకు గోదావరి జలాలు తరలిస్తామని స్పష్టం చేశారు. వైసిపి పాలనలో మంత్రులు, ముఖ్యమంత్రి జగన్ సైతం, పోలవరం ఎప్పుడు పూర్తవుతుందో, అసలు పూర్తవుతుందో లేదో కూడా చెప్పలేమని చేతులెత్తేసిన చేతకానితనాన్ని మంత్రి నిమ్మల ఈ సందర్భంగా గుర్తు చేసి ఎద్దేవా చేశారు. జగన్ పాలనలో విధ్వంస మైన పోలవరం ప్రాజెక్టును చంద్రబాబు ఏరకంగా ట్రాక్‌లో పెట్టారో కళ్లకు కట్టినట్లు వివరించారు.

ప్రాజెక్ట్‌లో ప్రధాన విభాగాల పనులు ఒకదాని తర్వాత ఒకటి కాకుండా సమాంతరంగా చేయటం,సమయం ఆదా చేయడం, సమర్థంగా చేయడం తమ ప్రభుత్వ ప్రత్యేకతగా రామానాయుడు స్పష్టం చేశారు. అలాగే పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు కూడా 2026 డిసెంబరు నాటికి పూర్తి పరిహారం చెల్లించడం, కాలనీలు నిర్మించడం లక్ష్యంగా పెట్టుకుని వడివడిగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. జలవనరుల శాఖ మంత్రి డాక్టరు నిమ్మల రామానాయుడు ప్రాజెక్టు పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అనంతరం ప్రాజెక్టు పనుల పురోగతి,భవిష్యత్తు కార్యాచరణ, పునరావాసంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు.ఈ సమావేశంలో ఇరిగేషన్ అడ్వైజరు యం.వెంకటేశ్వర రావు, ఆర్‌అండ్‌ఆర్ కమీషనరు ప్రశాంతి,జాయింటు కలెక్టరు యం.జె. అభిషేక్ గౌడ, ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటరు వి.అభిషేక్, రంపచోడవరం సబ్ కలెక్టరు శుభం నొక్వాల్, ఈఎన్ సి నరసింహ మూర్తి, మేఘా ఇంజనీరింగు సిఓఓ అంగర సతీష్ బాబు, ప్రాజెక్టు జనరల్ మేనేజరు గంగాధర్, ఇతర ఉన్నత అధికారులు, ఇంజనీరింగు బృందం, తదితరులు పాల్గొన్నారు.

# జనసేనకు జవసత్వాలు

మొదటిపేజీ తరువాయి

నియోజకవర్గ కమిటీలకు వీలుగా సన్నద్ధం కావాలిసిందిగా సంకేతం ఇచ్చారు. ఉమ్మడి పశ్చిమలో జనసేనకు గట్టి బలగం ఉంది. సీనియర్స్‌తో పాటు ప్రజాదరణ ఉన్న ఎమ్మెల్యే లుఉన్నారు.పార్టీ పిలుపు ఇస్తేచాలని భావించే క్యాడర్ ఉంది. ఇదే సమయంలో ఈమధ్య నామినేటెడ్ పదవులు దక్కినవారున్నారు.అంటే పార్టీ క్యాడర్ కు ఇంతకుముందులా కాకుండా కొంచెం పవర్ ఉన్న నేతల తోడ్పాటు ఉండనే ఉంది. ఈ మధ్యనే పార్టీలో ఎ వరెవరు నామినేట్ పదవులు పొందేరో కూడా పవన్ స్వయంగా ఆరా తీశారు.

**– స్థానిక ఎన్నికలకు సమయత్తం**

–వచ్చే ఏడాది స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగనున్న తరుణంలో జనసేన ఆ వైపే అడుగులు వేస్తోంది. ప్రత్యేకించి ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కూటమిలో భాగంగా తమకు వచ్చే స్థానాలలో అసెంబ్లీ మాదిరి గానే అన్ని స్థానాల్లో సేన సత్తా చాటలనేభావన సేనలో గట్టిగా ఉంది. భీమవరం, నరసాపురం,తాడేపల్లిగూడెం, పోలవరం, ఉంగుటూరు నియోజకవర్గాల్లోతో పాటు మిగిలిన నియోజకవర్గల్లో కూడా గట్టి పట్టు సాధించాలనే కసి జనసేనలో ఉంది. మున్సిపల్, నగర పంచాయతీ లలో కూడా జనసేన ముద్ర ఉండేలా ఇప్పటి నుంచే జాగ్రత్త పడుతున్నారు.

ఈ నెల లేదా వచ్చే నెలలో సేనాధిపతి పవన్ స్వయంగా ఉమ్మడి జిల్లాల వారీగా పార్టీ నేతలు, కార్యకర్తలుతో భేటీకి సిద్ధమవుతున్నట్టు సమాచారం.

# నేడు అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మెగా పేరెంట్స్,టీచర్స్ మీట్



– పిటిఎం 3.ఓ నిర్వహణపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష

**ఏలూరు,మేజర్ న్యూస్:** ఈనెల 5వ తేదీ శుక్రవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు పండుగ వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్ 3.ఓ నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో సమూల సంస్కరణలలో భాగంగా మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ (పిటిఎం) నిర్వహణకు శ్రీకారం చుట్టిందని,గత జూలై 10న జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ,ప్రైవేటు ఎయిడెడ్,ప్రైవేట్ అన్ ఎయిడెడ్, జూనియర్ కళాశాలలో మెగా పిటిఎం 2.0కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహించామన్నారు. అదేరీతిలో ఈనెల 5వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు నిర్వహించాలని, ప్రభుత్వంనిర్దేశించిన ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల విద్యా పురోగతి కోసం ప్రజల భాగస్వామ్యం ముఖ్యంగా తల్లితండ్రుల పాత్ర మెగా పిటిఎంలో కీలకమన్నారు. మెగా పిటిఎం ద్వారా తల్లితండ్రులు, ఉపాధ్యాయులు,పాఠశాలల మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి వేదికగా పనిచేస్తోందని, విద్యా పురోగతి, ప్రవర్తన సామాజిక సమస్యల గురించి అవగాహన చేసుకోవడానికి మెగా పిటిఎం దోహద పడుతుందన్నారు.

జిల్లాలోని 1748 ప్రభుత్వ , ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నిర్వహించాలని, ఈ కార్యక్రమంలో లక్షా 19 వేల 397 మంది విద్యార్థిని, విద్యార్థులతో పాటువారి వారి తల్లితండ్రులు పాల్గొంటారని అందుకు తగినవిధంగాఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమం ఉదయం9గంటలకుప్రారంభవుతుందని,ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లితండ్రులతో సహపంక్తి భోజన కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లా విద్యా శాఖాధికారి వెంకటలక్ష్మమ్మ, సమగ్రశిక్ష ఏపిడి పంకజ్ కుమార్, ప్రభృతులు పాల్గొన్నారు.

# సరిహద్దులను కాపాడటంలో నౌకాదళం పాత్ర కీలకం



– నేవెల్ యూనిట్ కమాండెంట్ రోహిత్ కుమార్

**నరసాపురం, మేజర్ న్యూస్ :** శ్రీ వై.ఎన్. కళాశాల లో ఎన్సిసి నేవల్ యూనిట్, భారత నౌకాదళ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 1971లో జరిగిన చారిత్రక 'ఆపరేషన్ ట్రైడెంట్'ను స్మరించుకుంటూ భారత నౌకాదళ వీరోచిత సేవలు విజయాలను ప్రతిబింబించారు. సెవెన్ ఆంధ్ర నావెల్ యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కమేండర్ చిట్టి రోహిత్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యి క్యాడెట్లను ఉద్దేశించి మాట్లాడుతూ భారత సముద్ర సరిహద్దులను కాపాడడంలో నౌకాదళం కీలక పాత్రను వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణను పెంపొందించు కొని రక్షణ దళాలలో ప్రవేశించడం పై ఆలోచించాలని ఆయన సూచించారు. ఎన్సిసి క్యాడెట్లకు నేవీ డే సందర్భంగా సర్టిఫికెట్స్ మెడల్స్ కాలేజీ యాజమాన్యం అందించింది. ముఖ్యఅతిథిగా హాజరైన రోహిత్ కుమార్ ను యాజమాన్యం తరఫున సత్కరించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కనకారావు,గవర్నింగ్ బాడీ మెంబర్ ఆర్ వి సుబ్బారావు, హెచ్ ఆర్ టి సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సి శ్రీనివాస్, డీన్ గంధం శ్రీ రామకృష్ణ, సబ్ లెఫ్టినెంట్ జీ సునీత, సెవెన్ ఆంధ్ర నావల్ యూనిట్ సిఐ ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్‌లో భోజనం చేసిన జే సి రాహుల్





– మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణ ఉండాలని ఆదేశం

**నరసాపురం,మేజర్ న్యూస్:** స్టీమర్ రోడ్‌లో ఉన్న అన్న క్యాంటీన్ ను జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. అన్నా క్యాంటీన్లో నిర్వహణ, పరిశుభ్రత, ఆహార నాణ్యత, వసతులును పరిశీలించారు. భోజనం చేస్తున్న ప్రజలతో మాట్లాడారు, పలు సూచనలు ఇచ్చారు. స్వయంగా లబ్ధిదారులకు భోజనంను వడ్డించారు. స్వయంగా ఆయన భోజనము రుచి చూశారు.

దూర ప్రాంతాల నుండి వచ్చిన టూరిస్టులు అన్న క్యాంటీన్లో భోజనం చేస్తూ ఉండటం చూసిన జాయింట్ కలెక్టర్ వారితో మాట్లాడారు. భోజనం ఎలా ఉంది అని అడుగుగా బయట హోటల్లో ఒకభోజనం ఖర్చు100 రూపాయలు అవుతుందని ప్రభుత్వం అన్నా క్యాంటీన్ ద్వారా 5 రూపాయలకే క్వాలిటీతో రుచికరమైన భోజనం అందించటంపై సంతోషం వ్యక్తం చేశారు. క్యాంటీన్ నిర్వహణ దారులతో మాట్లాడుతూ రోజుకు ఎంతమంది భోజనము చేస్తూ ఉంటారని జాయింట్ కలెక్టర్ ఆరాతీశారు. ప్రభుత్వం పేదల కొరకు 5 రూపాయలకే నాణ్యతతో రుచికరమైన భోజనం అందించటంవాటిపైఅవగాహన చేసుకోవాలన్నారు. భోజనం వేడివేడిగాక్వాలిటీగా ఉందని సర్వీస్ కూడా బాగుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారని అన్నారు. అన్నా క్యాంటీన్ నిర్వహణ సమయంలో మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణ ఉండాలనిఆదేశించారు. క్యాంటీన్లో లబ్ధిదారులకు వసతులు తోపాటు, పరిశుభ్రతను పాటించాలని అన్నారు. ప్రభుత్వఆదేశాలు ప్రకారం అన్నా క్యాంటీన్ నిర్వహణ సమయంలో నిర్వహణ,పరిశుభ్రత, నీటి సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్యాంటీన్‌లో చిన్న చిన్న మరమ్మతులను మున్సిపాలిటీ ద్వారా చేయడంజరిగిందని చెప్పారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు, మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య,తహసిల్దార్ అయితం సత్య నారాయణ,సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## భీమడోలు మండల పాఠశాలల తనిఖీలు

– నేడు మెగా పీటీఎం విజయవంతం చెయ్యాలని ఎంఈవో భాస్కర్ పిలుపు



**భీమడోలు,మేజర్ న్యూస్ :** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మెగా పీటీఎం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల విద్యాశాఖాధికారి భాస్కర్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం భీమడోలు మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి ఈనెల 5వ తేదీ శుక్రవారం నిర్వహించే మెగా పేరెంట్స్ డే ఏర్పాట్లను ఎంఈవో భాస్కర్ కుమార్ పరిశీలించి సదరు పాఠశాలల నిర్వాహకులకు పలు సూచనలు చేసారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ భీమడోలు మండలంలోని 40 ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పీటీఎం కార్యక్రమ నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వం విధించిన నియమనిబంధనలకు అనుగుణంగా కార్యక్రమం నిర్వహించాలన్నారు. శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో విద్యార్థుల తలిదండ్రులు పాల్గొని విద్యార్థి ప్రగతిని, పాఠశాల అభివృద్ధిని పలుఅంశాలను చర్చించడం జరుగుతుందని, సహపంక్తి భోజనాలతో కార్యక్రమం ముగుస్తుందని ఎంఈవో భాస్కర్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో భీమడోలు హైస్కూల్ హెచ్ఎం పద్మజ, ఉపాధ్యాయులు అహ్మద్ పాల్గొన్నారు.

## భీమడోలులో భవానీ మాలధారుల గ్రామోత్సవం



**భీమడోలు,మేజర్ న్యూస్ :** స్థానిక కాలువగట్టు శ్రీకనకదుర్గమ్మ భవానీ పీఠం అమ్మవారి ఊరేగింపు మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. అలంకరించిన పంచ అశ్వవాహనం పై శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాన్ని ఉంచి పంచకలశాలను ధరించి భవానీ మాలధారులు గ్రామంలో ఊరేగింపుగా గ్రామోత్సవం నిర్వహించారు. భవానీ పీఠం గురుస్వామి దుర్గారావు పర్యవేక్షణలో గ్రామక్షేమం, దేశక్షేమం కాంక్షిస్తూ అమ్మవారి గ్రామోత్సవం ప్రతి ఏటా భీమడోలు గ్రామంలో నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఠానికి చెందిన 100మంది భవానీ మాలధారులు పాల్గొన్నారు.

## సీఆర్ఎంటీల సమస్యలు పరిష్కరించాలి



**కామవరపుకోట,మేజర్‌న్యూస్:** సీఆర్ఎంటీల సమస్యలు పరిష్కరించాలని సీఆర్ఎం టీచర్స్ యునైటెడ్ ఫోరం ఏపీ పిలుపు మేరకు గురువారం స్థానిక ఎంఈవో ప్రశాంత్ కుమార్, డీటీ సౌజన్యకు ఉపాధ్యాయ సంఘం నాయకులు వినతిపత్రాలు సమర్పించారు. 2012 నుంచి పనిచేస్తోన్న సీఆర్ఎంటీలకు 2016 పీఏబీ ప్రకారం జీతాలు చెల్లిస్తున్నారని.. ఇప్పుడు జీతాలు పెంచి ఎంటీఎస్ లేదా హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, ఏ,బీ కస్టర్లను విలీనంచకుని, ట్రావెల్ ఎలవెన్స్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. వీరికి ఏపీటీఎఫ్ నుంచి మల్ల నాగేశ్వరరావు,బలరాం,పీఆర్టీయూ నుంచి జీవీకేవీఎస్‌హెచ్ఆర్ శర్మ,యూటీఎఫ్ నుంచినల్లమోతుల సత్య నారాయణ, వీఎస్ఆర్ఆచారి,బీటీఏ నుంచికే. శ్రీనివాస్,ఎస్టీయూ నుంచి ఎం. శివప్రసాద్ సంఘీభావంగా పాల్గొన్నారు. సీఆర్ఎంటీ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.కమలాకర్, కె.కరుణ సుందరి, ఎం. విజయలక్ష్మి , ఎం.నిర్మల కుమారి పాల్గొన్నారు.

# 31 మందికి వితంతు పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే చింతమనేని





**దెందులూరు, మేజర్ న్యూస్:** దెందులూరు నియోజకవర్గ పరిధిలో నూతనంగా మంజూరైన వితంతు పింఛన్లను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పింఛన్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్థానిక అధికారులు, కూటమి నాయకులు పుష్ప గుచ్చాలు అందించి మర్యాదపూర్వక స్వాగతం పలికారు. అనంతరం సమావేశానికి హాజరైన లబ్ధిదారులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదవాడి సంక్షేమాన్ని సమర్థవంతంగా అమలు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని,గత ఐదేళ్ల వైసిపి పాలనలో భర్తను కోల్పోయి ఈనాటికీ పింఛన్లు అందక ఎంతోమంది వితంతువులు అవస్థలు పడుతున్నారని, వైకల్యం లేని వాళ్ళకి కూడా నకిలీ సర్టిఫికెట్లు మంజూరు చేయించి అసలైన దివ్యాంగులకు చెందాల్సిన పింఛన్ సొమ్మును కూడా గత వైసిపి నాయకులు పక్కదారి పట్టించి దోచుకు తిన్నారని,అందుకే ప్రజల సొమ్మును దోచుకోవడం దాచుకోవడమే లక్ష్యంగా జరిగిన ఆనాటి వైసిపి పాలకుల దుర్మార్గపు పాలనను ప్రజలు తిప్పికొట్టారని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో బిజెపి సహకారంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీని నెరవేరుస్తూన్నారని అన్నారు. ఇటీవల కాలంలో పింఛన్ పొందుతున్న భర్తను కోల్పోయిన మహిళలకు వెంటనే వితంతు పింఛన్ మంజూరు చేసేలా ఎమ్మెల్యే చేపట్టిన చర్యలకు నియోజకవర్గంలోని 31 మంది మహిళలకు నూతనంగా పింఛన్లు మంజూరు అవగా,కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మరొకరికి నూతన పింఛన్ మంజూరు కాగా గురువారం ఉదయం ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా తమ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని త్వరితగతిన పింఛన్ మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టి తమ 32 కుటుంబాలకు అండగా నిలిచిన ఎమ్మెల్యే చింతమనేనికి పింఛన్ లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

## మినికిట్స్ ద్వారా విత్తనాలివ్వడం సంతోషం



**వాసవి పెనుగొండ,మేజర్ న్యూస్:** చినమల్లంలో జాతీయ సేవా పథకంలో భాగంగా ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన వ్యవసాయ కళాశాల జాతీయ సేవా పథకం ఏడు రోజుల ప్రణాళికలో భాగంగా ఆఖరి రోజు రైతు సదస్సు – రైతులు శాస్త్రవేత్తల చర్చ కార్యక్రమంపై సదస్సును రాజమండ్రి అసోసియేట్ డీన్ డా. శ్రీనివాస్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాజవోలు గ్రామం వ్యవసాయ కళాశాల రాజమండ్రి వారికి దత్తత గ్రామం అని తెలియచేశారు.రైతులకి మినికిట్స్ ద్వారా వరి విత్తనాలను ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని తెలియచేశారు. చినమల్లం గ్రామంలో ఏర్పాటు చేసిన సదస్సులో భాగంగా విద్యార్థులు ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. అసోసియేట్ డీన్, శాస్త్రవేత్తలు ,రైతులు ఈఎగ్జిబిషన్ సందర్శించారు. విద్యార్థులు వారి మోడల్స్‌ను వివరించటం జరిగినది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అధ్యాపకులు, ఆర్.ఎ.ఆర్.ఎస్ మార్టేరు శాస్త్రవేత్తలు ,డాక్టర్. ఎస్.దయాకర్ ,డాక్టర్ సి. హెచ్.శ్రీనివాస్ ,వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్.కె.ఎమ్. దక్షిణామూర్తి,డాక్టర్. హెచ్.శ్రీనివాస్,డాక్టర్ జి.రమేష్,మండల అగ్రికల్చర్ ఆఫీసర్ స్పందన ,ఎన్. ఎస్ ఎస్ అధికారులు డాక్టర్.కె.వసంత భాను,డాక్టర్.సి. హెచ్.సునీత ,రైతులు ,గ్రామస్థులు , విద్యార్థి,విద్యార్థినులు పాల్గొన్నారు.

## దర్భరేవులో బాల్యవివాహాలపై అవగాహన




**నర్సాపురం రూరల్,మేజర్‌న్యూస్:** మొగల్తూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి బి.ఊర్మిళ ఆదేశాలు మేరకు బాల్య వివాహ్ ముక్తభారత్ 100రోజులు కార్యక్రమం మండలం లోని దర్భరేవు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల్లో గురువారం నిర్వహించారు. దీనిలోభాగంగా బాల్యవివాహాలు అనర్ధలను తెచ్చిపెడతాయని, బాల్యవివాహాలు చేసుకోరాదని ఐసీడీస్ సూపర్వైజర్ సిహెచ్ దుర్గా భవాని సూచించారు.ప్రొటెక్షన్ ఆఫీసర్ బి.నెహెమియ బాల్య వివాహాలు వల్ల కలిగే నష్టాలు వివరించారు. ఈకార్యక్రమంలో పాఠశాలప్రధాన ఉపాధ్యాయులు వి.న్.వి.లక్ష్మి, ఏ.న్మ్,ఆశా,అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మొంథా తుఫాన్ బాధితులకు రెడ్ క్రాస్ చే సహాయక సామాగ్రి పంపిణీ



**నర్సాపురం,మేజర్‌న్యూస్ :** పశ్చిమగోదావరి జిల్లాలో మొంథా తుఫాన్ కారణంగా నష్టంజరిగిన 93మంది కుటుంబాలకుగురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీఆధ్వర్యంలో సహాయక సామాగ్రి పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో మానవతా సేవలో ముందంజలో ఉండేది రెడ్ క్రాస్ సంస్థ అన్నారు.రెడ్ క్రాస్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు అనేకం ప్రజల నుండి అభినందనలు అందుకుంటుందని అన్నారు. రక్తదాన శిబిరాలు ప్రోత్సాహం కార్యక్రమాలు పురోధిగతిలో ఉండటం సంతోషకరమని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని సామాజిక కార్యక్రమాలను చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి సూచించారు. రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డా.భద్రిరాజు మాట్లాడుతూ విపత్తు సమయాలలో రెడ్ క్రాస్ సంస్థ ద్వారా ప్రజలకు అందించేసేవలనుగురించి వివరించారు. రాష్ట్ర రెడ్ క్రాస్ చైర్మన్ వైడి రామారావు, రాష్ట్ర ట్రెజరర్ డి శ్రీహరి రావు మాట్లాడుతూ రెడ్ క్రాస్ చేపడుతున్న మానవతా సేవలు అభినందనీయం అని రెడ్ క్రాస్‌కు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ సందర్భంగా నరసాపురం మొంథా తుఫాను కారణంగా నష్టపోయిన నరసాపురం, మొగల్తూరు మండలాలలోని 93 మంది బాధిత కుటుంబాలకు రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా సహాయక సామగ్రి కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ దాసిరాజు, తహసిల్దారులు ఐవి విసత్యనారాయణ, రాజ్ కిషోర్, రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ వి.కనకరాజు, కె.తిరుపతి రాజు,సిహెచ్ ఫణి కుమార్, గోపిశెట్టి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

## రూ.20 కోట్ల విలువైన శ్రీ సీతారామ స్వామి దేవస్థానం భూమి స్వాధీనం



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** పట్టణం లో వేంచేసి యున్న శ్రీ సీతారామ స్వామి దేవస్థానంకు సంబందించిన భూమి ఆర్‌సి నెం.121/2లో గల య. 9.41సెంట్లు గత 60సంవత్సరంలు నుండి ఆక్రమణలో ఉన్నది. సెక్షన్ 83 ఓఎఫ్ చట్ట ప్రకారం 30/1987 ప్రకారం భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమి స్వాధీనం కొరకు జిల్లా ఎండోమెంట్ అధికారి కూచిపూడి శ్రీనివాసు సమక్షంలో కార్యనిర్వాహణాధికారులు ఎ.రవి శంకర్ జి.పవన్ కుమార్, గోకుల తిరుమల పారిజాత గిరి,సిబ్బంది పాల్గొన్నారు. భూమి విలువ సుమారు 20 కోట్ల రూపాయలు అని తెలిపారు.

## శ్రీ మద్ది ఆలయంలో కన్నుల పండగగా దీక్షాదారుల మహా పూర్ణాహుతి





**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్:** మండలంలోని గుర్వాయిగూడెం గ్రామం నందు శ్రీ మద్ది ఆంజనేయ స్వామి వారి దేవస్థానం నందు గురువారం ఉదయం గం.6 లకు చింతపూడి గ్రామస్తులు డోలక్ సుబ్బారావు భజనా మండలి వారిచే భక్తి సంకీర్తనలు అనతరం విశేష పంచామృత అభిషేకం జరిగింది. తదుపరి హనుమద్ దీక్షాదారుల మాహా పూర్ణాహుతి ,హనుమద్ దీక్షాధారుల దీక్షా విరమణ అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ కార్యక్రమంలో సుమారు 3వేలు మంది హనుమద్ దీక్షాధారులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, అత్యంత భక్తి భావముతో భజనలు చేసి, మహా పూర్ణాహుతి అనంతరం ఇరుముడులను సమర్పించి, హనుమత్ దీక్షలను విరమించారు. శ్రీ స్వామి వారి దేవస్థానంనకు వివిధ సేవల రూపేణా రూ.3,75,755లు సమకూరింది. శ్రీ స్వామి వారి దేవస్థానమునకు విచ్చేసిన సుమారు 5100లు భక్తులు నిత్యాన్నదాన సత్రం నందు అన్నప్రసాదం వితరణ జరిగినది. ఈ పూర్ణాహుతి కార్యక్రమం ఆద్యంతం ఇంత వైభముగా జరగడానికి సహకరించిన హనుమద్ దీక్షాదారులకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపినట్లు ఆలయ అసిస్టెంట్ కమీషనర్, కార్యనిర్వహణాధికారిణి ఆర్.వి.చందన తెలిపారు.

## ఘనంగా అంతర్జాతీయ విభిన్న ప్రతిభా వంతుల దినోత్సవం



**కుక్కునూరు,మేజర్ న్యూస్ :** మండలం కేంద్రంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభవంతుల దినోత్సవం స్థానిక ప్రాథమిక పాఠశాల రామసింగారంలో భవిత సెంటర్లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిదిగా ఎంఈఓ కృష్ణ ప్రసాద్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఐఇఆర్‌పి పాల్గొన్నారు,మండల విద్యాశాఖ అధికారి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రభుత్వం వారు వీరికి భవిత సెంటర్ ద్వారా ప్రత్యేక విద్య అందిస్తున్నారు. ప్రత్యేకమైన క్యాంపులు ద్వారా వీరికి అవసరమైన వివిధ రకాల ఉపకరణాలు అందిస్తున్నారు అలాగే వీరికి ఎస్కార్ట్ ,ట్రాన్స్పోర్ట్, గర్ల్స్ స్టైఫండ్, హెూం బేస్డ్ అలవెన్సులు కూడా వస్తున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెండవ ఎంఈఓ గిరి భగవాన్ దాస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంగాల రామకృష్ణ ,టీచర్ లక్ష్మీ దుర్గ,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# భీమవరం టిడిపిలో వర్గ పోరు అవాస్తవం



– కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు

**భీమవరం,మేజర్‌న్యూస్:** భీమవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో వర్గపోరు, విభేదాలు ఉన్నాయని ప్రచారం చేస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని ఏపీ కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు ఖండించారు. భీమవరం టిడిపి కార్యాలయంలో నిర్వహించిన నాయకుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.నియోజకవర్గ ఇన్చార్జ్ తోటసీతారామలక్ష్మి నేతృత్వంలో పార్టీబలోపేతంగా పనిచేస్తోందని, పార్టీ అధికారంలో లేకపోయినా ఆమె కష్టపడి పార్టీ కార్యక్రమాలు విజయవంతం చేశారని పేర్కొన్నారు. కొన్ని టీవీ చానల్స్, యూట్యూబ్ ద్వారా వస్తున్న తప్పుడు ఆరోపణలు పార్టీని దెబ్బతీసే కుట్రగా అభివర్ణించారు.మండల, పట్టణ అధ్యక్షులు కొల్లేపర శ్రీనివాస్, గణపతి, మద్దుల రాము తదితరులు మాట్లాడుతూ సీతారామలక్ష్మి అధికారంలో ఉన్నా, లేనప్పటికీ పార్టీని విడిచిపెట్టకుండా సేవలందించారని, ఆమెపై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని ఖండిస్తున్నామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇటువంటి తప్పుడు వార్తలు ప్రచారం చేసే వారిపై పరువునష్టం దావాలు దాఖలు చేస్తామని హెచ్చరించారు.గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ పామర్తి వెంకటరామయ్య కూడా తనపై ప్రచారం జరుగుతున్న విభేదాల వార్తలు అసత్యమని స్పష్టం చేశారు.టిడిపి సీనియర్ నాయకులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, రేవు వెంకన్న మాట్లాడుతూతోట సీతారామలక్ష్మి ఎన్నో కీలక హోదాల్లో నిజాయితీతో పనిచేసి పార్టీకి బలమై నిలిచారని, ఆమెపై కొన్ని మీడియా సంస్థలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.సమావేశంలో కార్పొరేషన్ డైరెక్టర్లు ఉప్పులూరి చంద్రశేఖర్ ఎండి షబీనా వీరవాసరం మండల ఉపాధ్యక్షుడు యరకరాజు గోపాలకృష్ణంరాజు భీమవరం మండల టిడిపి మాజీ ప్రధాన కార్యదర్శి కావూరు పృథ్వీశంకర్ టిడిపి పట్టణ కమిటీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

– ప్రారంభించిన సొసైటీ అధ్యక్షులు మద్దుబాల నాగేశ్వరరావు



**కొయ్యలగూడెం,మేజర్ న్యూస్ :** బయ్యన్నగూడెం గ్రామ ప్రజలు వృద్ధుల నుంచి చిన్నారులు వరకు ప్రతి ఒక్కరు కోపరేటివ్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. చేసుకోవాలని బయ్యన్నగూడెం సొసైటీ అధ్యక్షులు మద్దు బాల నాగేశ్వరరావు పేర్కొన్నారు.ఈసందర్భంగా సొసైటీ వద్ద గురువారం ఏర్పాటు చేసినటువంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కంటి సమస్యలు ఉన్న వారు మరీ ముఖ్యంగా సద్వినియోగం చేసుకోవాలని, వైద్య శిబిరం వద్ద నిర్వహించిన పరీక్షలలో మొత్తం 105 మందికి వైద్య పరీక్షల్లు నిర్వహించగా 96 మందికి కళ్ళజోళ్ళు, అందజేసి ఏడుగురు వ్యక్తులకు ఆపరేషన్ కోసం ఏలూరు ఆశ్రం హాస్పటల్ వద్ద నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు.ఆపరేషన్ చేయించుకునే వ్యక్తులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ అకౌంట్ బుక్,తమ ఫోన్ నెంబర్ వెంట తెచ్చుకోవాలన్నారు.ఈ కార్య క్రమంలో జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి మద్దుతేజ విశ్వనాథ్,పంచాయతీ కార్యదర్శి జగదీష్ , తెలుగుదేశం పార్టీ యువ నాయకులు పారేపల్లి నరేష్,సొసైటీ డైరెక్టర్ బాలం నరేష్, తుమ్మలపల్లి అంజలి,కూటమి నాయకులు,ప్రజలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యార్థి పట్ల అసభ్య ప్రవర్తన : ఉపాధ్యాయుడు సస్పెన్షన్




**పాలకొల్లు,మేజర్‌న్యూస్ :** మండలంలో ఆగర్రు గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు తెలుగు ఉపాధ్యాయుడు రవికుమార్ 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో డిఇఓ సస్పెండ్ చేశారు. విద్యార్థిని వారి కుటుంబ సభ్యులకు చెప్పగా వారు ఆందోళన చేయగా ప్రధానోపాధ్యాయురాలు ఉన్నత విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.దీనితో ఆ ఉపాధ్యాయుడిని జిల్లా విద్యాశాఖ అధికారి సస్పెండ్ చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు చెప్పారు, గురువారం విద్యాశాఖ ఉన్నత అధికారుల నుండి సస్పెన్షన్ ఆర్డర్ వచ్చినట్లు చూపారు,

# ఏపుగుంటలో ప్రభుత్వ భూమికి రక్షణ కరువు !

– అక్రమ ఆక్రమణదారునికి కూటమి నేతల అండ ?

**టి.నరసాపురం,మేజర్‌న్యూస్ :** టి.నరసాపురం మండలంలోని ఏపుగుంటలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురి అవుతున్నది అని రెవిన్యూ అధికారులకు స్థానికులు తెలియచేయడంతో అధికారులు గతంలో ఆక్రమణ దారుడి పై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా అధికారులు పలుమార్లు ఆక్రమణకు ప్రయత్నిస్తున్న వ్యక్తిని కార్యాలయానికి పిలిపించి హెచ్చరించడం జరిగిందని అధికారులు తెలిపారు. అయినా సదరు వ్యక్తి ఆ స్థలంలో షెడ్డు నిర్మాణం చేశారని ఆలస్యంగా అధికారులకు తెలియడంతో గురువారం రెవిన్యూ అధికారులు షెడ్డు కూల్చివేయడానికి యంత్రాలను తీసుకుని వెళ్లగా స్థానిక కూటమి నేతలు కొందరు అధికారులను అడ్డుకున్నారు.దీనిపై స్థానిక తహసీల్దార్ సాయిబాబా ను వివరణ కోరగా ఆ భూమి ప్రస్తుతం కోర్టు విచారణలో ఉందని, ఆ స్థలాన్ని ఎవరు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని చరవాణిలో తెలిపారు. అక్రమ ఆక్రమణ గురించి ఉన్నతాధికారులకు తెలియజేశామని, వారి ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని తాసిల్దార్ సాయి బాబా స్పష్టం చేశారు.అసలు ఈ భూమికి సంబంధిన వివరాల్లోకి వెళితే 2003లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో సర్వే నెంబర్ 60/16బి,17బి లలోని దాదాపు రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని అదే గ్రామానికి చెందిన సుమారు 25మంది లబ్ధిదారులకు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసినట్లు సమాచారం.అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీరిని ఆ స్థలంలోకి వెళ్లకుండా అడ్డుకొని వేరే వారికి పట్టాలివ్వడానికి ప్రయత్నాలు జరుగుతుండటంతో లబ్ధిదారులు 2008 లో హైకోర్టు ను ఆశ్రయించారు.

అప్పటినుండి ఆ భూమి ఖాళీగానే ఉందని స్థానికులు తెలుపుతున్నారు.

2016లో హై కోర్టు వీరికి ఇచ్చిన భూమి పట్టాలను సమ్మతిస్తూ మిగిలిన భూమిని వేరే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని జడ్జిమెంట్ ఇచ్చింది. విచిత్రం ఏమిటంటే కోర్టు జడ్జిమెంటుకు కేవలం 17 రోజులు ముందు అప్పటి తహసీల్దార్ ఇదే భూమికి మరో 24 మందికి పట్టాలు మంజూరు చేసినట్లు సమాచారం.

వీరు భూమిని స్వాదినపరచుకొని ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రయత్నిస్తుండగా ప్రభుత్వం మారింది.

కొత్త ప్రభుత్వం తమ పట్టాలను ఎక్కడ రద్దుచేస్తారో అన్న భయంతో వీరు 2020లో హైకోర్ట్ ను ఆశ్రయించగా కోర్టు స్టేటస్ కో

ఇచ్చిందని లబ్ధిదారులు తెలుపుతున్నారు.అయితే ఇప్పుడు ఈ భూమిలో ఒక వ్యక్తి అధికార పార్టీ నాయకుల అండతో అక్రమంగా భూమిలోకి ప్రవేశించి రాత్రికి రాత్రే షెడ్డు ఏర్పాటు చేసినట్లు సమాచారం రెవిన్యూ అధికారులకు అందడంతో వారు షెడ్డును కూల్చివేయడానికి ప్రయత్నించగా కొందరు కూటమి నాయకులు అడ్డుకున్నట్లు సమాచారం. అసలు ఏపుగుంటలో ఉన్న ప్రభుత్వ భూమి ఎంత? ప్రభుత్వం ఎంతమందికి పట్టాలు మంజూరు చేసింది? కోర్టు విచారణలో ఉండగా కొత్తవారికి పట్టాలు మంజూరు చేసిన తహసీల్దార్ ఎవరు? భూ ఆక్రమణకు సాహసం చేసిన వ్యక్తికి మద్దతు తెలిపే నాయకులెవరు? రెవెన్యూ యంత్రాంగం విచారణలోతెలియాల్సి ఉంది.

## పంచాయతీ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు



**కామవరపుకోట,మేజర్‌న్యూస్:** గ్రామపంచాయతీ ఆస్తులు, స్థలాలు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కామవరపుకోట గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి వి.రవినాయక్ అన్నారు.గురువారం స్థానిక చౌతనా సెంటర్లో అంబేద్కర్ విగ్రహం ముందు రోడ్డుకు అడ్డంగా తోపుడుబండ్లు పెట్టి వ్యాపారం చేస్తున్న పలు బండ్లను ఆయన దగ్గరుండి మరీ తొలగించారు. అనంతరం పంచాయతీ పారిశుధ్య సిబ్బందితో అక్కడ ఎలాంటి చెత్తా చెదారం లేకుండా చూడాలని ఆదేశించడంతో పాటు శానిటేషన్ పనులు చేయించారు. రవినాయక్ వెంట పలువురు పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## కూటమి రాకతో మారిన పంచాయతీరాజ్ శాఖ : విప్ 'బొలిశెట్టి '



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్:** కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేశాక పంచాయతీ రాజ్ వ్యవస్థలో పెను మార్పులు తీసుకువచ్చిన ఘనత కూటమికే దక్కుతుందని, పల్లెటూళ్ళు పట్టుకొమ్మలుగా రాష్ట్రాన్ని సుభిక్షంగా ఉంచేందుకు ప్రభుత్వం అహర్నిశలు కృషి కృషి చేస్తుందని బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,పంచాయతీ రాజ్ శాఖామంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ గురువారం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 77 డివిజనల్ డెవలప్ మెంట్ అధికారుల కార్యాలయాలను ప్రారంభిస్తున్న కార్యక్రమంలో భాగంగా తాడేపల్లిగూడెం రూరల్ మండలం, పెద్ద తాడేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన స్థానిక డివిజనల్ డెవలప్ మెంట్ అధికారి వారి కార్యాలయాన్ని శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్ స్థాయిలో ప్రజల వద్దకు పరిపాలన తెచ్చేందుకై నేడు పంచాయతీరాజ్ వ్యవస్థలో నెలకొల్పిన డివిజనల్ డెవలప్మెంట్ అధికారి కార్యాలయాలు పల్లెటూరులకు పట్టుకొమ్మలుగా నిలుస్తాయని ఆయన అన్నారు.

## బాలయ్య అఖండ -2 బ్లాక్‌బస్టర్ ఖాయం : ఎమ్మెల్యే రోషన్



**కామవరపుకోట, మేజర్ న్యూస్:** టాలీవుడ్ స్టార్ హీరో, టీడీపీ హిందూపురం ఎమ్మెల్యే నంద మూరి బాలకృష్ణ నటించిన అఖండ 2 తాండవం సినిమా ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ అవుతోన్న సంగతి తెలిసిందే. బోయపాటి – బాలయ్య కాంబినేషన్ కావడంతో సినిమాపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి.ఈ క్రమంలోనే ఈ సినిమా టిక్కెట్‌లను ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ గురువారం సాయంత్రం ఆయన క్యాంప్ కార్యాలయంలో టీడీపీ కార్యకర్తల సమక్షంలో రిలీజ్ చేశారు. అఖండ 2 బ్లాక్‌బస్టర్ ఖాయం అని రోషన్ ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నందమూరి అభిమానులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో కామవరపుకోట క్లస్టర్ ఇంచార్జి డాన్ బొబ్బిలి, నెక్కలపు సూర్యనారాయణ,గోధుమ మధు,బిరుదుగడ్డ రాజేష్, కాసన్నేని బుద్దియ్య, యలమర్తి రాంబాబు, పిల్లమర్రి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# సీనియర్ కాంగ్రెస్ నాయకులు మందలపు సత్యనారాయణ మృతి






**- ఎమ్మెల్యే రోషన్,మాజీ ఎమ్మెల్యే ఎలీజ, వైసిపి నేత విజయరాజు నివాళులు**

**లింగపాలెం,మేజర్‌న్యూస్:**లింగపాలెం మండలం మఠంగూడెం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు మందలపుసత్యనారాయణ గురువారంరాత్రి స్వర్గస్తులయ్యారు. విషయం తెలిసి ఎమ్మెల్యే సొంగారోషన్ కుమార్, మాజీ ఎమ్మెల్యే విఆర్ ఎలీజ, వైసిపి ఇంచార్జ్ కంభం విజయ రాజు,వైసిపి మండల పార్టీ ప్రెసిడెంట్ అన్నపనేని శాంతారావు, రావి కొండయ్య, ముసునూరు వెంకటేశ్వరరావు,కుప్పాల రామకృష్ణ, జెట్టి గురునాథం, మట్ట సురేష్, మోరంపూడి జగన్, తదితర నాయకులు నివాళులు అర్పించారు.

కాగా మఠంగూడెం గ్రామానికి చెందిన చింతలపూడి మాజీ సమితి అధ్యక్షులు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు మందలపు సత్య నారాయణ కొద్దిసేపటి క్రితం స్వర్గస్తులయ్యారు అన్న విషయం తెల్సకుని ఆయన స్వగృహానికి వెళ్లి పూలమాల వేసి పలువురు అన్ని పార్టీల నాయకులు అంజలి ఘటించారు.

# కత్తవపాడులో ఆర్‌సిఎం చర్చికి శంకుస్థాపన



**ఇరగవరం,మేజర్ న్యూస్** :మండలంలోని కత్తవపాడు గ్రామంలో రోమన్ క్యాథలిక్ మిషన్ చర్చి నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఓగిడి విచారణ గురువు రెవ రెండ్ ఫాదర్ నెల్లి జర్జీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ కాపరి వసంతాడ బాబురావు మాట్లాడుతూ గ్రామంలో ఆర్‌సిఎమ్ చర్చ నిర్మాణం శుభదాయకం అన్నారు. చర్చ నిర్మాణానికి అందరు సహకరించాలని కోరారు. చర్చ నిర్మాణానికి స్థలం దానమిచ్చిన సంఘ విశ్వసి ఆకుమర్తి ధనంజయను అయన అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ మామిడి లక్ష్మి పణింద్ర, ఎంపీటీసీ మల్లిడి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ ఇంటి ఆదినారాయణ, కూటమి నాయకులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గోదావరికి పంచ హారతులు



**వాసవి పెనుగొండ, మేజర్‌న్యూస్:** పెనుగొండ మండలం సిద్ధాంతం వశిష్ట గోదావరి వద్ద గురువారం రాత్రి పౌర్ణమి సందర్భంగా సిద్ధాంతం హిందూ ధర్మ పరిరక్షణ సమితి వారి ఆధ్వర్యంలో కలగా భద్రుడు స్వామి బ్రహ్మోత్వంలో జయవరపు వంశీ, లక్ష్మీ దీప్తి దంపతులచే గోదావరి మాతకు "పంచ హారతులు" అతి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకముక, ద్విముఖ, చతుర్ధ, పంచమ, కుంభ, నక్షత్ర, పూర్ణ, కుంభ, సర్ప, హారతులు వశిష్ట గోదావరికి వేద పండితుల సమక్షంలో ఈ హారతుల కార్యక్రమం కొనుల పండుగ చేశారు. నదీమతల్లులను ఆరాధించడం అనాదిగా వస్తున్న మన సంప్రదాయమని తెలిపారు. పూర్ణిమ రోజున గోదావరి నదీమ తల్లికి సంధ్యా హారతిని ఇవ్వటం జరిగిందని హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు తెలియజేసారు.

# శ్రీ మావుళ్ళమ్మ దేవస్థానంలో విశిష్ట చండీహోమం



**భీమవరం,మేజర్‌న్యూస్ :** భీమవరం పట్టణంలో వైభవంగా వెలసిన ప్రముఖ ఇలవేలుపు ఆరాధ్యదైవం శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానంలో, శ్రీమహాలక్ష్మి ప్రథమ మాసమైన మార్గశిర పౌర్ణమి సందర్భంగా విశేష చండీహోమం ఘనంగా నిర్వహించారు. భక్తులకు సిరి సంపదలు కలగాలి అన్న సంకల్పంతో చేపట్టిన ఈ హోమాన్ని దేవస్థానం ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లిఖార్జున శర్మ ఆధ్వర్యంలో అర్చకులు, వేదపారాయణ దారులు వైదిక పద్ధతుల్లో ఆద్యంతం నిర్వహించారు.

వందమందికి పైగా భక్తులు ప్రత్యక్షంగా పాల్గొనగా, పరోక్ష విధానంలో మరికొందరు భక్తులు హోమంలో భాగ స్వాములయ్యారని ఆలయ సహాయక కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేశ్ తెలిపారు. హోమ కార్యక్రమం అనంతరం తీర్థప్రసాదాలు అందజేయగా, చండీహోమం చేయించుకున్న భక్తులకు మేళతాళ ధ్వనుల మధ్య ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. తరువాత అన్నసంతర్పణలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేయగా, మార్గశిర పౌర్ణమి సందర్భంగా దేవాలయం భక్తుల రద్దీతో కళకళలాడింది.

# అవసరార్ధులకు ఆర్ధిక చేయూతనందించేందుకే సిఎంఆర్ఎఫ్



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** అవసరార్ధులకు ఆర్ధిక చేయూతనందించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఒకపక్క ప్రజాదర్బారు ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరిస్తూనే, మరోపక్క అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు బాధితులకు సిఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేసిన ఆయన వారికి భరోసా కల్పించారు. ప్రజాదర్బార్ కార్యక్రమంలో వారి వినతులను స్వీకరించారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇదేసమయంలో అనారోగ్యంతో బాధపడుతున్న 22 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 13లక్షల 81వేల రూపాయల విలువైన చెక్కులను అందించిన ఎమ్మెల్యే బడేటి చంటి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటినుండి నేటివరకూ ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో దాదాపుగా 4కోట్ల రూపాయలను అవసరార్ధులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందించినట్లు చెప్పారు. దీనిద్వారా సుమారు 385 మంది బాధితులకు న్యాయం చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, టిడిపి ఏలూరు నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, కార్యదర్శి రెడ్డి నాగరాజు,వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, క్లస్టర్ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జిలు తదితరులు పాల్గొన్నారు.

# సోషలిజంతోనే సమానత్వం సాధ్యం

**- నాగేశ్వరరావు సంస్మరణ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్**




**యలమంచిలి,మేజర్‌న్యూస్:** ప్రస్తుత సమాజంలో సామాజిక ఆర్థిక అసమానతలు కులాల మధ్య అంతరాలు పోయి సమానత్వం రావాలంటే ఒక్క సోషలిజం తోనే సాధ్యమని సిపిఎం జిల్లా కార్య దర్శి జె ఎన్ వి గోపాలన్ అన్నారు. గురువారం మండలంలోని చించినాడ సమరశీల పోరాట నాయకుడు కేతా నాగేశ్వరరావు సంస్మరణ సభ ఆ పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు అధ్యక్షతన జరిగింది. తొలుత నాగేశ్వరరావు చిత్రపటానికి సిపిఎం సీనియర్ నా కొల్లి గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి జిత్తుగా నరసింహా మూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కేతా సూర్యరావు ,కవురు ,ముచ్చర్ల త్రిమూర్తులు, మహిళా సంఘం నాయకురాలు సరిపల్లి జయప్రభ కానేటి బాలరాజు, దేవ సుధాకర్, బాతిరెడ్డి జార్జి తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులను ఎత్తుకుని ముద్దాడిన జిల్లా కలెక్టర్ నాగరాణి





**పాలకోడెరు,మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాలకోడేరు మండలంలోని విస్సాకోడేరు గ్రామంలో ఉన్న శిశు గృహ సంరక్షణ కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా శిశు గృహ సంరక్షణలో ఉన్న పిల్లలను ఎత్తుకుని ముద్దాడారు. ఎంతమంది పిల్లలు ఉన్నారు, దత్తత ప్రక్రియ ఎంతవరకు వచ్చింది తదిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. శిశు గృహ సంరక్షణలో ఉన్న పిల్లలను శ్రద్ధగా చూడాలని ఈ సందర్భంగా తెలిపారు. జీరో నుండి ఆరు సంవత్సరాల వయసులోపు కలిగిన పిల్లలు శిశు గృహ సంరక్షణలో ఉంచడం జరుగుతుందని, ప్రస్తుతం ఇద్దరు చిన్నారులు శిశు గృహంలో ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంలో భీమవరం ఆర్డీవో కే.ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఐసిడిఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేష్, జెఎస్పి నాయకులు జుత్తిగ నాగరాజు, శిశు గృహ నిర్వాహకులు, తదితరులు ఉన్నారు.

# ఛాంబర్స్ కళాశాలలో నేవీ డే వేడుకలు



**పాలకొల్లు,మేజర్ న్యూస్ :** జాతీయ నేవీ డే సందర్భంగా ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో జాతీయ జెండాను కళాశాల ప్రిన్సిపల్ ఆవిష్కరించి ఎన్సిసి నావెల్ విభాగం విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ భద్రతలో సైన్యంలోని నావి విభాగం కీలక భూమిక పోషిస్తుం దని,సముద్రం నుండి భూమి పైకి, భూమి పై నుండి సముద్ర జలమూలంలోకి విదేశీ సైన్యాన్ని శత్రువులను ఎదుర్కొని దేశాన్ని కాపాడే రక్షణ కవచంగా నేవీ విభాగం నిరంతరాయంగా కృషి చేస్తుందన్నారు. జాతీయ భద్రతలో నేవీ రంగములో ఎన్సిసి విద్యార్థులు ప్రధాన భాగస్వాములు కావలసి ఉందని విద్యార్థి దశ నుండే రక్షణ, శిక్షణ, క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భ ంగా ఎన్సిసి విభాగం విద్యార్థులు గాడ్ ఆఫ్ ఆనర్ ఇచ్చి కవాతు నిర్వహించారు ,కుమారి యామిని ఛాంబర్స్ కళాశాల పూర్వ విద్యా ర్థిని కళాశాలకు 12 మొక్కలను బహుకరించారు. ఈ కార్యక్రమ ంలో ఎన్సిసి కేర్ టేకర్ రవికృష్ణ 7(ఏ ఏ)నావెల్ యూనిట్ స్టాఫ్ రమేష్,పరమేశ్వర్ కుమావత్‌లు ఎన్సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

# పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతానికి డిడిఓ కార్యాలయాలు





**– జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు**

**పాలకోడేరు,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ గురువారం చిత్తూరు జిల్లాలో నూతనంగా నిర్మించిన డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయంతోపాటు రాష్ట్రంలో నూతనంగా నిర్మించిన మొత్తం 77 డిడిఓ కార్యాలయాలయ భవనాలను లాంఛనంగా వర్చువల్ గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి,పాలకోడేరు మండలంలోని విస్సా కోడెరు గ్రామంలో ఏర్పాటు చేసినడివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు ఎమ్మెల్యే పత్చమట్ల ధర్మరాజు, ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జె.ఎస్.పి నాయకులు జుత్తుగ నాగరాజు, డీఎల్డీఓ వై.దోసి రెడ్డి, సమిత్వ స్టేట్ డైరెక్టర్ ఎ.నిషాంత్ రెడ్డి, డ్వామా ఎపిడి పి.సుజాత,తదితరులు పాల్గొన్నారు. అనంతరండిడిఓ,డిఎల్పిఓ, ఏపీఓ, సిబ్బంది గదులను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ శాసనసభ్యులు డిడిఓ కార్యాలయ ప్రాంగణంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు,వారికి సంబంధించిన వివిధ రకాల పనుల కోసం జిల్లా కేంద్రానికి రాకుండా డివిజనల్ స్థాయిలో ఏర్పాటుచేసిన డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాల వద్దకు రావాలన్నారు. ఈ కార్యాలయంలో డిడిఓతో పాటు డివిజనల్ పంచాయతీ అధికారి,ఉపాధి హామీ సహాయ ప్రాజెక్టు అధికారి, సంబంధిత అధికారుల సిబ్బందికి వసతి కల్పించడం జరిగిందన్నారు. అంతేకాకుండా డిడిఓకు కొన్ని విధులు కేటాయించారని అందులో ముఖ్యంగా డివిజన్ స్థాయిలోని అన్నిప్రభుత్వశాఖలవారిసమన్వయంతోఅభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ఎం.రామనాథరెడ్డి, ఇంచార్జి తహసిల్దార్ ఎం.రఘు,ఎంపీడీవో రెడ్డయ్య,ఈవోపీఆర్డి రాంప్రసాద్, జిల్లా ఇండస్ట్రియల్ అధికారి యు.ముంగపతిరావు, జిల్లా చేనేత శాఖా అధికారి అప్పారావు, డీఎస్ఓ ఎన్ సరోజ,ఐసిడిఎస్ పిడిడిశ్రీలక్ష్మి, డీఎఫ్ఓ బి.శ్రీనివాసరావు,ఎస్టి వెల్ఫేర్ అధికారి పుష్ప రాణి, జె.ఎస్.పి నాయకులు జుత్తుగ నాగరాజు, స్థానిక కూటమి నాయకులు, అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న జనాభాకనుగుణంగా మున్సిపల్ కార్మికులను పెంచాలి



**– ఏపీ ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమయ్య డిమాండ్**

**జంగారెడ్డిగూడెం,మేజర్‌న్యూస్ :** పట్టణ జనాభా రోజు రోజుకి విపరీతంగా పెరిగిపోతున్న కారణంగా జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను కూడా పెంచాలని ఏపీ.ఎంఈఎఫ్.రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య డిమాండ్ చేశారు. గురువారం జంగారెడ్డిగూడెం విచ్చేసిన ఆయన పారిశుధ్య కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ కె.వెంకట రమణను మర్యాద పూర్వకంగా కలిసి గ్రేడ్ –1 మున్సిపాలిటీ అయిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలపై కమీషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. పెరుగుతున్న పట్టణ జనాభా ప్రకారం మున్సిపల్ కార్మికులను పెంచాలని, మున్సిపల్ కార్మికుల ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం జంగారెడ్డిగూడెంలో ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని, పారిశుధ్య విభాగంలో ఉపయోగిస్తున్న ట్రాక్టర్లు,రిక్షాలు,పుష్ కార్ట్‌లు వెంటనే రిపేర్లు చేయించాలని, జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీలో పనిచేస్తున్న అన్ని విభాగాల కార్మికులకు పిఎఫ్,ఈఎస్ఐలు సక్రమంగా జమ చేయాలని, నాలుగు ఎకౌంట్లలో ఉన్న పీఎఫ్ జమలను ఒకే అకౌంట్లోకి బదిలీ చేయాలని, సర్వీసులో ఉండగా చనిపోయిన,రిటైర్డ్ అయిన ఆప్కాస్ కార్మికుల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ ఏలూరు నాయకులు ఎల్.కృష్ణారావు, బి. వెంకటేశ్వరరావు, బండి రాజా, వి. కిషోర్,పట్టణ అధ్యక్షుడు రేలంగి నాగరాజు, ప్రధాన కార్యదర్శి కూనపాముల విఘ్నేశ్వరరావు,సభ్యులు కే.నాగేశ్వరరావు,బి. శ్రీనివాస్, కె.రాజు,కె.రాంబాబు,ద్.మంగమ్మ, పెంటయ్య, వి.ఏమిలేశ్వ రావు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిగా ఏలూరు - జంగారెడ్డిగూడెం రోడ్డు



**– కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ పుట్టా మహేష్ విజ్ఞప్తి**

**ఏలూరు/ఢిల్లీ,మేజర్‌న్యూస్ :** ఏలూరు – జంగారెడ్డిగూడెం రోడ్డును నాలుగులైన్ల జాతీయ రహదారిగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నానని కొద్ది రోజుల కిందట ఉంగుటూరు, గొల్లగూడెంలో జరిగిన సీఎం సభలో చెప్పిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆదిశగా ఢిల్లీలో తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. గురువారం కేంద్ర రోడ్లు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ఈ రోడ్డును గ్రీన్‌ఫీల్డ్ హైవేగా లేదా నాలుగులైన్ల జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేయవలసిందిగా కోరుతూ విజ్ఞాపన పత్రం అందజేశారు. ఢిల్లీలో పార్లమెంట్ శీతాకాల సమావేశాలలో పాల్గొంటున్న ఎంపీ. గురువారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ను ఆయన కార్యాలయంలో కలిశారు.

కేంద్ర మంత్రికి ఇచ్చిన లేఖలో ఏలూరు – జంగారెడ్డిగూడెం రోడ్డు ప్రాధాన్యతను వివరించారు. వ్యవసాయ ఉత్పత్తులు, ఆక్వా ఉత్పత్తులు, క్వారీ పదార్థాలు ,ఇతర వస్తువులను రవాణా చేయడానికి ప్రధాన మార్గంగా ఉన్నప్పటికీ, ప్రస్తుత రహదారి చాలా ఇరుకుగా ఉండి, ట్రాఫిక్ పరిమాణం మాత్రం చాలా ఎక్కువగా ఉండటం వల్ల వాహనదారులకు, సమీప గ్రామాల ప్రజలకు ఇబ్బందిగా ఉన్న ఈ రహదారిని విస్తరించవలసిన అవసరం ఉందని ఎంపీ తన లేఖలో పేర్కొన్నారు.

ఈ రహదారిని గ్రీన్‌ఫీల్డ్ హైవేగా లేదా నాలుగులైన్ల జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేసినట్లయితే ఈప్రాంతంమౌలిక సదుపాయాలు మెరుగు పరచడానికి, జిల్లాలోని ఇతర ప్రాంతాలతో కనెక్టివిటీని పెంచి,సామాజిక ఆర్థిక వృద్ధికి చాలా ఉపయోగ పడుతుందన్నారు. వీలైనంత త్వరగా సాధ్యాసాధ్యాల అధ్యయనం చేసి,సర్వే,డీపీఆర్ తయారీని ప్రారంభించమని సంబంధిత అధికారులను ఆదేశించాల్సిందిగా ఎంపీ కేంద్ర మంత్రిని కోరారు.

## కృత్రిమ కాళ్ళు అమర్చిన రోటరీ క్లబ్ ఆఫ్ నూజివీడు మ్యాంగో టౌన్



**నూజివీడు,మేజర్‌న్యూస్:** రోటరీ క్లబ్ ఆఫ్ నూజివీడు మ్యాంగో టౌన్, నూజివీడు వారి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కృత్రిమ కాళ్ళ అమర్చేందుకు స్క్రీనింగ్ క్యాంపులో 36 మందికి కృత్రిమ కాళ్ళు అమర్చేందుకు ఎంపిక చేయడం జరిగిందని రోటరీ క్లబ్ అఫ్ నూజివీడు మ్యాంగో టౌన్ అధ్యక్షులు ఎస్. శశికాంత్ తెలిపారు. నూజివీడు పట్టణంలోని రోటరీ ఆడిటోరియంలో నిర్వహించిన స్క్రీనింగ్ క్యాంపు నకు 40 మంది హాజరయ్యారని, వీరిలో 36 మందికి కృత్రిమా కాళ్ళు అమర్చేందుకు ఎంపిక చేసి, వారికి సరిపడా కృత్రిమ కాళ్ళు సైజు కొలతలు తీసుకోవడం జరిగిందన్నారు. మిగిలిన నలుగురు ఇటీవలే ఆపరేషన్ చేయించుకున్నందున, మరికొంత కాలం ఆగవలసి ఉంటుందని వారికి తెలియజేయడం జరిగిందన్నారు. ఎంపిక చేసిన వారికి త్వరలో కృత్రిమ కాళ్ళు అమర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు సజ్జా శశి కాంత్, కార్యదర్శి మండా శ్రీనివాస్,పిడి వెంకట రత్నం, బోయపాటి ముఖర్జీ,అనిల్,లక్షణ స్వామి,రాజగోపాల్, మలిశెట్టి శ్రీనివాస్, పొట్లూరి ప్రసాద్,సాయి భాస్కర్,వెంకటేశ్వరరావు,సబ్బినేని శ్రీనివాస్, నరేంద్ర,లావు మురళీ పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ లేబరేటరీ సేవలను వినియోగించుకోవాలి



**భీమడోలు,మేజర్‌న్యూస్ :** భీమడోలు కేంద్రంగా మత్స్య శాఖ ఏర్పాటుచేసిన ఇంటిగ్రేటెడ్ లేబరేటరీ సేవలను వినియోగించు కోవాలని, భీమడోలు, మత్స్య అభివృద్ధి శాఖ అధికారి నీలాపు దుర్గా భవాని కోరారు. ఆక్వా రైతులకు అవగాహన కల్పించేందుకు మత్స్య అభివృద్ధి శాఖ అధికారి తన బృందంతో కురెళ్ళగూడెం గ్రామంలో గురువారం పర్యటించారు. చేపల చెరువులను పరిశీలించారు. ఒక ఆక్వారైతు కు చెందిన చెరువు వద్ద నీటి నమూనా పరీక్షలను నిర్వహించారు. ఆక్వా రైతులు, మత్స్యకారులు శ్రేయస్సుతో పాటు మత్స్య సంపద అభివృద్ధి లక్ష్యంగా మత్స్య శాఖ పలు కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తుందన్నారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పలు రాయితీ పథకాలను అమలు చేస్తుందని వివరించారు. ఇదే క్రమంలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన, దాని అనుబంధం పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మత్స్య శాఖకు చెందిన ల్యాబ్ టెక్నీషియన్లు, సిబ్బందితోపాటు పలువురు ఆక్వా రైతు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో నిర్లక్ష్యంపై ఆగ్రహం : మెమో జారీకి ఆదేశాలు



**కామవరపుకోట, మేజర్‌న్యూస్:** మండలంలోని కొండగూడెంలోని అంగన్వాడి కేంద్రాన్ని స్థానికుల ఫిర్యాదు మేరకు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు వంటిపల్లి విజయకృష్ణ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఉదయం 11.30 గంటలకు కూడా అక్కడ అంగన్వాడీ వర్కర్, పిల్లలు లేకపోవడంతో పాటు పిల్లలకు ఇవ్వాల్సిన పాలు,గుడ్లు కూడా పంపిణీ చేయకపోవడంతో ఆయన అంగన్వాడీ వర్కర్ నిర్లక్ష్యంపై అసహనం వ్యక్తం చేశారు. కేంద్రంలో పిల్లలు ఉండాల్సిన చోట మంచం వేసి ఉండడం.. పిల్లలను తీసుకువచ్చి అప్పటికప్పుడు వంట చేస్తామని చెప్పడంతో ఆయన వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని.. మెమో జారీ చేయాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు విజయ్‌కృష్ణ తెలిపారు.